2—5—86 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

## మినీ కథ

# అప్పు

నిఖిల

ఫ్యాక్టరీకి బయలుదేరాలనుకుం టున్న లక్ష్మయ్య గుడిసె ముందు ఆరోజు పొద్దున్నే ఊరి కోమటి శంకరయ్య ఊడిపడ్డాడు. వెంటనే ఆయనను గుర్తు పట్టలేకపోయాడు.

ఎట్లా దేవులాడుకుంటూ వచ్చాడో కాని మొత్తంపై శంకరయ్య లక్ష్మయ్య గుడిసెను పట్టేశాడు.




చాలా మర్యాదగా - ప్రేమగా శంకరయ్యనే మొదలు పల్కరించాడు— "ఏం లక్ష్మయ్యా -బాగున్నావా? ఎంత కాలమైంది నిన్ను జూడక? నన్ను మీ వాళ్లంతా మరచిపోయింద్రయ్యా?"

"అసలు మొదలు నిన్ను గుర్తు పట్టందే నేను? ఇక నిన్ను నేను మరచి పోయిందెక్కడ! మా ఊరి కోమటాయననే గదా? ఏం పని మీద వస్తివి?"— లక్ష్మయ్య అడిగాడు.

శంకరయ్య ఎంతో ఆశ్చర్యంగా మొగం వెడల్పు చేస్తూ — "అయ్యో నన్నే మరచిపోయినావ్? అవును మరీ - నేనెందుకు గ్యాపకం వుంటా? అప్పు ఇచ్చినోడు లోకంలో ఎక్కడైనా గ్యాపకం వుంటాడా?" నిష్ఠూరంగా అన్నాడు.

లక్ష్మయ్య మరింత ఆశ్చర్యంగా ముఖం పెట్టి— "ఎక్కడి దే అప్పు? ఎవరు తీసుకుండ్రు నీ దగ్గర?" అనుమానం వెలిబుచ్చాడు.

శంకరయ్య అప్పుడు తాను వచ్చిన రహస్యం విప్పాడు— "నీకు అదంతా తెలవదులే! మీ నాయన నువ్వు పుట్టక మునుపు అంటే ఆయన మీ అమ్మను పెండ్లి చేసుకున్నప్పుడు నా దగ్గర నూరు రూపాయిలు అప్పు తీసుకుండు. ఇగ్గో, ఇప్పుడిస్తా అప్పుడిస్తానని కాలం గడిపి తానే కాలం చేసిపోయిండు. ఇగ నువ్వున్నావు గదా - కష్టం జేసుకుని పట్నంలో బతుకుతున్నవ్ - మరి మీ నాయన పెండ్లి అప్పు తీరుస్తవులే అనే నమ్మకంతో ఇంతకాలం వుంటి. చూడు బిడ్డా! కోమటోడి అప్పు కాటికి పోయినా వదలదు. మీ నాయన పెండ్లి అప్పు మరి తీర్చాలి గదా?"

ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు లక్ష్మయ్యకు. నాయన పెండ్లి అప్పు కొడుకు తీర్చాలా? ఇంతకాలం ఆ అప్పు వసూలు చేసుకోకుండా కోమటాయన ఊరుకుంటాడా? వడ్డీ ఏమైనా మిగిలిపోయిందేమో పాడు? అయినా తాను చెయ్యని ఈ అప్పుకు ఎట్లా బాధ్యత వహించాలి? అందులో ఇంత కాలానికి ఈ కోమటాయన కాలం చెల్లిపోయిన అప్పుకు తనను బిగ పడతాడేమిటి?

ఇక లాభం లేదని లక్ష్మయ్య కొంచెం కోపంగా అన్నాడు— "చూడు శంకరయ్య — నాకా అప్పు సంగతి ఎవ్వరూ చెప్పలేదు. ఇప్పుడొచ్చి 'మీ నాయన పెండ్లి అప్పు తీర్చమని' నన్ను నిలదీస్తే చిన్న పిల్లలైనా నవ్వుతారే— మా నాయన పెండ్లి అప్పు ఇంతకాలం ఎట్ల మిగిలింది?"

శంకరయ్య ఎగిరిపడి — "ఎట్ల మిగిలిందంటే నేనేం జెప్పను! పెండ్లి చేసుకున్నోడు మీ నాయన— ఆ నిజాం నాటి కాలంలో! నిన్ను పుట్టించి మరీ చచ్చిపోయిండు. ఆయనకు పుట్టినోడివి— ఆయన చేసిన అప్పుతోనే గదా మీ అమ్మ పెండ్లి జరిగింది. వాళ్లకు పుట్టినోడివి - వాళ్ల ఋణాన్ని తీర్చవా?"

ఇదెక్కడి తర్కమో అర్థం కాలేదు లక్ష్మయ్యకు — రెచ్చిపోయి ఎదురు తిరిగాడు —"ఇగో - ఊరికే నోరు పారేసుకోకు! నేను అసలు నీ దగ్గర అప్పు తీసుకోలేదు. నప్పుడదాకా నోర్మూసుకొని పో! కావాలంటవ్ - ఒక పూట అన్నం తినిపో. మా ఊరి కోమటాయననే మర్యాదతో చెబుతున్నా!"

"ఇదేంది? బిచ్చగాన్నా అన్నం పెడతనంటవ్! అప్పు తీర్చకపోతే వూరికే నే పోతనా?"

"నువ్వు ఎక్కడికైనా వెళ్లి ఫిర్యాదు చేసుకో! కేసు పెట్టుకో - ఒక్క పైస ఇచ్చేది లేదు" అని తెగించి చెప్పాడు లక్ష్మయ్య.

చివరికి దొరికిందే నయమనుకొని శంకరయ్య అడిగాడు — "కోమటోడ్ని! నువ్వు వండిన అన్నం ఎట్ల తింట! కొన్ని బియ్యం పడేయ్ — ఏదో వండుకొనైనా తింటా!"

గత్యంతరం లేక లక్ష్మయ్య బియ్యం పెట్టి శంకరయ్యను సాగనంపాడు. ●